# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-04-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఉత్తరాఖండ్‌లోని జాతీయ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న ఐఎఎస్ అధికారులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగించారు.**

**2.** **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగుతోంది.**

**3.** **రానున్న రెండు రోజులు రాష్ట్రంలో ఎండలు, వడ గాడ్పులు మరింత తీవ్రం కానున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.**

**4.** **టికెట్ల కొనుగోలును మరింత సులభతరం చేసేందుకు రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టినట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు.**

**5.** **ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ ప్రవేశ పరీక్ష-ఏపీఆర్ సెట్ 2023-24 షెడ్యూల్‌ని విడుదల చేసినట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వెల్లడించారు.**

==========================

ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 2023 బ్యాచ్ ట్రెయినీ ఐఎఎస్ అధికారులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నిన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఐఎఎస్ అధికారులు దేశభవిష్యత్తుని తీర్చిదిద్దడానికి, ప్రజాసేవకు అంకితం కావాలని అన్నారు. అధికారులుగా సమాజాభివృద్ధికి తమవంతు తోడ్పాటుని అందించాలని సూచించారు.

--------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సాగుతోంది. నెల్లూరు గ్రామీణ మండలం చింతా రెడ్డి పాలెం నుంచి మొదలైన బస్సు యాత్ర కోవూరు, రాజుపాలెం, గౌరవరం, సున్నపుబట్టి, బోగోలు క్రాస్ మీదుగా మద్దూరు పాడుకు చేరింది. తిప్ప, గౌరవరం మీదుగా కావలి జాతీయ రహదారి చేరుకుని సాయంత్రం 3 గంటలకి జాతీయ రహదారి సమీపంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం ఏలూరుపాడు, ఉలవపాడు క్రాస్, సింగరాయకొండ క్రాస్, ఓగురు, కందుకూరు, పొన్నలూరు, వెంకుపాలెం మీదుగా జువ్విగుంట వద్ద రాత్రి బస చేస్తారు.

--------------------------

రానున్న రెండు రోజులు రాష్ట్రంలో ఎండలు, వడగాడ్పులు మరింత తీవ్రం కానున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పార్వతీపురం మన్యంజిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. ఈరోజు 179 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 208 మండలాల్లో వడగాడ్పులు, ఆదివారం 44 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 193 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. శ్రీకాకుళం జిల్లాలో 26, విజయనగరం 25, పార్వతీపురం మన్యం 15, అనకాపల్లి 16, అల్లూరి సీతారామరాజు 9, కాకినాడ 13, కోనసీమ 7, తూర్పుగోదావరి 16, ఏలూరు4, కృష్ణా 4, ఎన్టీఆర్ 6, గుంటూరు 14, పల్నాడు 17 మండలాల్లోను తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వివరించింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది.

---------------------------

రైల్వే జనరల్ టికెట్ల కొనుగోలును మరింత సులభతరం చేయడంతో పాటు డిజిటల్, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని విజయవాడ రైల్వే సీనియర్ డీసీఎం వి.రాంబాబు తెలిపారు. తొలి దశలో పైలెట్ ప్రాజెక్టు కింద విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు డివిజన్ పరిధిలోని తెనాలి, ఏలూరు, రాజమహేంద్రవరం బుకింగ్ కౌంటర్‌లలో ప్రయోగాత్మకంగా ఈ విధానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నగదుతో పని లేకుండానే నేరుగా ప్రయాణికులు క్యూఆర్ కోడ్ సాయంతో జనరల్ టికెట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్‌లోని నగదు చెల్లింపు యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే జనరల్ టికెట్ జారీ అవుతుందని చెప్పారు. ఈ సౌకర్యాన్ని క్రమంగా డివిజన్ వ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లలో అమలు చేస్తామని తెలిపారు.

---------------------------

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ ప్రవేశ పరీక్ష-ఏపీఆర్ సెట్ 2023-24 షెడ్యూల్‌ని విడుదల చేసినట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వెల్లడించారు. మే 2 నుంచి 5వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 10 నుంచి ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 14 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని, 10 వేల మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

---------------------------

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులో వెట్టి చాకిరి నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై నిన్న అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల కార్మిక నిర్మూలనకు అన్ని వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తుందని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని కృష్ణాజిల్లా నూతన కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన డీకే బాలాజీ మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాకు కలెక్టర్‌గా

రావడం ఎంతో ఆనందంగా ఉందని, అందరి సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారిగా పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85 ఏళ్లు పైబడినవారు, 40 శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ సిబ్బంది, ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి ని రిటర్నింగ్ అధికారికిగానీ, సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అందుబాటులో ఉంది.

---------------------------

ఎన్నికలు అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నిన్న అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకొనేలా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఉంటే జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

---------------------------

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన ఉద్యోగులు, వాలంటీర్లు, కాంట్రాక్ట్ సిబ్బందిపై చర్యలు చేపట్టామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.అరుణబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నిన్న 49 మంది వాలంటీర్లు, ఏడు మంది కాంట్రాక్ట్ సిబ్బంది, ముగ్గురు రెగ్యులర్ సిబ్బంది, ఇద్దరు రేషన్ డీలర్లను తొలగించడం జరిగిందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రీకృత కంట్రోల్ రూమ్ నుంచి రోజువారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పంపిస్తున్నామని తెలిపారు.

---------------------------

అంబులెన్సుల నిర్వాహకులు నిర్ణీత ధరలకు వ్యతిరేకంగా అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాసుపత్రులకు 300 మీటర్ల దూరంలో ఎవరైనా అంబులెన్సులను ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ప్రతి వాహనంలో ఛార్జీల పట్టిక తప్పనిసరిగా ఉంచాలని స్పష్టం చేశారు. ఛార్జీల అంశంపై 85008-14033 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు.

---------------------------

వేసవి సెలవుల నేపథ్యంలో ఆరు రైళ్ల ప్రయాణ సేవలను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. కాచిగూడ నుంచి తిరుపతికి ప్రతి గురువారం వెళ్లే ప్రత్యేక రైలును మే 1 వరకు, శుక్రవారం వెళ్లే తిరుపతి-కాచిగూడ రైలు మే 2 వరకు, బుధవారం వెళ్లే సికింద్రాబాద్-రామగుండం రైలును ఏప్రిల్ 24 వరకు రైల్వే శాఖ పొడిగించినట్లు పేర్కొంది.

=====================